సాక్షి
బాపట్ల
ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023



వేదాద్రిలో 'హ్యూమన్‌రైట్స్' ఛైర్మన్

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహస్వామిని ఏపీ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఛైర్మన్ సీతారామమూర్తి శనివారం రాత్రి దర్శించుకున్నారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ నిత్యాన్నదాన పథకానికి నెల్లూరు సరస్వతినగర్‌కు చెందిన వెంకటరెడ్డి కుటుంబం రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు.

నాలుగు కోవిడ్ కేసులు నమోదు



గుంటూరుమెడికల్: గుంటూరు జిల్లా వ్యాప్తంగా శనివారం నాలుగు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రెండు, తెనాలి, మంగళగిరిలలో... తెలప్రోలు, హనుమాయపాలెంల్లో ఒక్కొక్కటి చొప్పున కేసులు వచ్చాయి. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.



ఆదమరిస్తే.. అగ్గిపాలే!

- అప్రమత్తతోనే అగ్నిప్రమాదాల నివారణ
- నిర్లక్ష్యం వహిస్తే నష్టం అధికం
- జిల్లాలో అగ్నిప్రమాద వారోత్సవాలు ఆరంభం
- 14 నుంచి 20 తేదీ వరకు అవగాహన సదస్సులు

బాపట్లటౌన్: సూరీడు నేలకొచ్చినట్టు ఎండలు మంట రేపుతున్నాయి.. జనానికి సెగలు పుట్టిస్తున్నాయి. సామాన్య ప్రజలను అల్లాడిస్తున్నాయి.. ఈ సమయంలోనే చిన్నపాటి అజాగ్రత్తతో అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉంది. తద్వారా సర్వం బుగ్గి అవుతోంది.. తీవ్ర నష్టాన్ని మిగుల్చుతోంది.. ఎండాకాలం, మండించే కాలం కాబట్టి అప్రమత్తత అవసరమని అగ్నిమాపక శాఖ అధికారులు సూచిస్తున్నారు. బాపట్ల జిల్లాలో రేపల్లె, బాపట్ల, చీరాల, అద్దంకి నియోజకవర్గాల్లో నాలుగు అగ్నిమాపక కేంద్రాలున్నాయి. జిల్లావ్యాప్తంగా అగ్నిమాపక శాఖలో 97 మంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 65 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. 32 పోస్టులకు ఖాళీ ఉంది. జిల్లా వ్యాప్తంగా ఫైర్ ఇంజిన్లు 4, మిస్ట్ వెహికల్ 01, పోర్టబుల్ పంప్స్ 4, అడ్మినిస్ట్రేటివ్ వెహికల్ 1, మోటర్‌సైకిల్ విత్ మిస్ట్ ఎగ్జిటింగ్ గేషర్ 01, రిస్కూ బోట్ 02, పవర్ సాప్స్ 04, ఆస్కా లైట్స్ 03, లైఫ్ జాకెట్స్ 74 అందుబాటులో ఉన్నాయి.

గతేడాది రూ.3.76 కోట్ల మేర నష్టం

జిల్లాలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు 340 అగ్నిప్రమాదాలు జరగగా వాటిల్లో రూ. 3.76 కోట్ల మేర నష్టం జరిగింది. అగ్నిప్రమాదాల్లో రూ.15.20 కోట్లు సిబ్బంది సకాలంలో స్పందించి కాపాడారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉండటంతో ఏ చిన్నపాటి ప్రమాదం వాటిల్లినా తీవ్రంగా నష్టపోవాల్సి రావడంతో అగ్నిప్రమాదాలను అదుపు చేసేందుకు అగ్నిమాపక శాఖాధికారులు విశేష కృషి చేస్తున్నారు.

14 నుంచి 20 వరకు వారోత్సవాలు

అగ్నిప్రమాదాల నివారణలో భాగంగా ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దానిలో భాగంగా ఈనెల 14న జిల్లాలోని అగ్నిమాపక కేంద్రాలను సందర్శించి సిబ్బంది కుటుంబ సభ్యులతో సమీక్షలు నిర్వహించారు. 15న ప్రధాన కూడలి ప్రాంతాలైన రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్, మాల్స్, మార్కెట్, సినిమా థియేటర్ అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. 16న అపార్ట్‌మెంట్లు, గ్యాస్ కంపెనీలు, విద్యుత్ శాఖ కార్యాలయాలు సందర్శించి ఫైర్ సేఫ్టీ పరికరాల పనితీరును పరిశీలించి వారికి అవగాహన కల్పిస్తారు. 17న జిల్లావ్యాప్తంగా కళాశాలలు, పాఠశాలల్లోని విద్యార్థులకు, 18న పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ గోడౌన్స్ నిర్వాహకులకు, 19న హాస్పిటల్స్‌లో ఫైర్ సేఫ్టీపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. 20న అగ్నిప్రమాదాలపై సమావేశం నిర్వహించి ప్రమాదాలు సంభవిస్తే ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పిస్తారు.



బాపట్ల అగ్నిమాపక కేంద్రం

సమయస్ఫూర్తి అవసరం

ప్రస్తుతం ఎండలు అధికమయ్యాయి. ఈ సమయంలో అగ్నిప్రమాదం జరిగితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. జిల్లాలో అధికశాతం తీరప్రాంత గ్రామాలు, మారుమూల ప్రాంతాలు కావడంతో ఏ చిన్న ప్రమాదం జరిగినా అంతా బుగ్గి అవుతుంది. గతంలో తీరప్రాంత గ్రామాల్లో అగ్నిప్రమాదాలు జరిగి భారీ నష్టం చూడాల్సి వచ్చిందన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో సమయ స్ఫూర్తితో వ్యవహరిస్తే నష్టాన్ని నివారించవచ్చు.

అగ్నిమాపకశాఖ సూచనలు

- కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గి పుల్లలను ఆర్పివేసిన తర్వాత పారేయాలి. చెత్త, గడ్డి, ఎండిన చెట్లు, పూరిపాకల వద్ద వీటిని వేయరాదు.
- ఎక్కువ రోజులు ఇంట్లో లేని సమయంలో విద్యుత్ మెయిన్ ఆఫ్ చేయాలి.
- వంట గదిలో గాలి, వెలుతురు ఉండేలా చూసుకోవాలి.
- గృహాలకు గడ్డి వాములు 60 అడుగుల దూరంలో వేసుకోవాలి.
- పూరింట్లో నివసించే వారు వంట పూర్తయిన వెంటనే పొయ్యిలో నిప్పును ఆర్పి వేయాలి.
- వేసవిలో ఉదయం 8 గంటల లోపు, సాయంత్రం 6 గంటల తరువాత కట్టెల పొయ్యిలను ఉపయోగించాలి.
- గ్యాస్ సిలెండరుకు దగ్గరలో పెట్రోలు, డీజిల్, కిరోసిన్ వంటి మండే వస్తువులను ఉంచరాదు.
- వంట పూర్తయిన వెంటనే రెగ్యులేటర్ ఆపి వేయాలి.
- అపార్ట్‌మెంట్లు, కర్మాగారాల గోదాములు, గిడ్డంగులలో అగ్నిమాపక శాఖ సూచనలు విధిగా పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు.

సమాచారమిస్తే తక్షణమే స్పందిస్తాం



అగ్ని ప్రమాదాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందిస్తే వెంటనే స్పందిస్తాం. అగ్నిమాపక శకటం వచ్చేలోగా నీటితో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించాలి. తద్వారా నష్టం కాస్త తగ్గుతుంది. ప్రమాదం జరిగిన వెంటనే 101, బాపట్ల ఫైర్‌స్టేషన్- 08643224311, చీరాల 08594 232299, రేపల్లె 08648 222101, అద్దంకి 08593224101 నెంబర్లకు సమాచారం అందించాలి.

– సి. మాధవ్‌నాయుడు, జిల్లా అగ్నిమాపకశాఖాధికారి



సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, పక్కన ఎమ్మెల్సీ పోతుల సునీత, బాచిన కృష్ణ చైతన్య, కరణం వెంకటేష్

'జగనన్నే మా భవిష్యత్తు'కు బ్రహ్మరథం

- కన్వీనర్లు, గృహ సారథులను ప్రజలు అపూర్వంగా స్వాగతిస్తున్నారు
- దేశ చరిత్రలోనే సువర్ణ అధ్యాయం 'మా నమ్మకం నువ్వే జగన్'
- ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ పోతుల సునీత, పార్టీ అద్దంకి, చీరాల ఇన్‌చార్జిలు

బాపట్ల: 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం స్పందనపై సమావేశం నిర్వహించారు. నాయకులు తమ అనుభవాలను వివరించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజల సంతోషాలను నేరుగా చూడగా... ఈ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందని తెలిపారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు తమకు ఏ విధంగా అన్యాయం చేశాయో గుర్తుచేసుకుంటూ.. సచివాలయ వ్యవస్థ వల్ల ఏ విధంగా లబ్ధిపొందుతున్నారో ప్రజలే స్వయంగా చెబుతున్నారని తెలిపారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే చూసుకోవాలనే ఆకాంక్షతో ప్రజలు ఉన్నారని ఎమ్మెల్యే కోన ఈ సందర్భంగా వెల్లడించారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా..

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు వెళుతున్నారని ఎమ్మెల్సీ పోతుల సునీత పేర్కొన్నారు. ఎటువంటి ఆంక్షలు లేకుండా అర్హతే ఆధారంగా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని వివరించారు. అన్ని కులాల్లో నిరు పేదల లబ్ధికోసం ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఇంటింటికీ వెళుతుంటే ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న ప్రేమ, మమకారాలు అర్థమవుతున్నాయన్నారు. 70 నుంచి 80శాతం మంది ప్రజలు ప్రభుత్వానికి అనుకూలంగా తమ మద్దతు తెలియజేయటం నిజంగా అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ప్రజలకు ఎన్నో రకాలైన సంక్షేమ ఫలాలు అందిస్తుందని, ప్రజలు పార్టీకి వెన్నుదన్నుగా ఉన్నారనే దానికి ఈ కార్యక్రమం ఒక ఉదాహరణగా చెప్పవచ్చన్నారు. చేనేతలను ఆదుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని పార్టీ వేమూరు నియోజకవర్గ పరిశీలకుడు మోహన్‌రావు తెలిపారు. చేనేతలకు ఐదేళ్లకు రూ.150కోట్లు చంద్రబాబునాయుడు ఖర్చుచేయగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.800కోట్లు ఖర్చు పెట్టారని తెలిపారు. ఈసమావేశంలో అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

'పది' ఇన్విజిలేటర్ సస్పెన్షన్

రేపల్లె రూరల్: మండలంలోని వడ్డీవారిపాలెంలో జెడ్పీహైస్కూలులో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షల తీరును శనివారం ఆర్జేడీ పార్వతి పరిశీలించారు. కేంద్రంలో స్లిప్‌లు కనిపించటంతో మాస్‌కాపీయింగ్ జరుగుతుందని అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మునియ్య, డిపార్ట్‌మెంటల్ అధికారి నరేంద్ర, ఇన్విజిలేటర్ వినోద్‌కుమార్‌లను ఆదేశించారు. ఇన్విజిలేటర్ వినోద్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈఓ రామారావు తెలిపారు.

పది పరీక్షలు ప్రశాంతం



నరసరావుపేటఈస్ట్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పల్నాడుజిల్లా పరిధిలో శనివారం నిర్వహించిన సాంఘిక శాస్త్రం పరీక్షకు 126 పరీక్షా కేంద్రాలలో 25,219మంది విద్యార్థులకుగాను 24,853మంది హాజరయ్యారు. మరో 366మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కాగా, కాంపోజిట్, ఒకేషనల్ విద్యార్థులకు ఈనెల 17, 18తేదీలలో పరీక్షలు జరగనున్నాయి. ఎటువంటి సమస్యలు లేకుండా పదో తరగతి ప్రధాన పరీక్షలు ప్రశాంతంగా ముగియటం పట్ల జిల్లాలోని విద్యాశాఖాధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒకేషనల్, కాంపోజిట్ విద్యార్థులకు జరగనున్న పరీక్షలను సైతం ప్రశాంతంగా ముగించేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు.

వక్ఫ్ భూముల కౌలువేలం మరోసారి వాయిదా

నాదెండ్ల: గొరిజవోలు రెవెన్యూ పరిధిలోని షాహీ మసీదు వక్ఫ్ భూముల బహిరంగ కౌలు వేలం మరోసారి వాయిదా పడినట్లు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ కరిముల్లా బాషా తెలిపారు. గొరిజవోలు గ్రామంలో సర్వే నెం .424, 425, 430లో మొత్తం 32 ఎకరాల వక్ఫ్ భూమి ఉంది. దీనికై శనివారం గ్రామ సచివాలయంలో బహిరంగ వేలం నిర్వహించగా, నలుగురు రైతులు మాత్రమే హాజరయ్యారు. అయితే అధికారులు రూ.10వేలు కౌలుగా తేల్చటంతో వేలంలో రైతులు పాల్గొనలేదు. గతంలో మార్చి నెలలో ఓసారి కౌలు వేలం నిర్వహించగా, అధికారులు ఎకరాకు రూ.10 వేలు కౌలును నిర్ణయించగా, దీనిపై రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో అప్పుడు కౌలు వేలం వాయిదా పడింది. అయితే అమీనాబాద్‌కు చెందిన ఓ రైతు తనకు 20 ఏళ్ల పాటు కౌలుకు అనుమతించినట్లయితే తాను మామిడి తోట సాగు చేసుకుంటానని తెలపటంతో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తమ నిర్ణయం చెబుతామని అధికారులు తెలిపారు.

డీఎస్ఓగా పద్మశ్రీ



గుంటూరువెస్ట్: జిల్లా పౌర సరఫరాల శాఖాధికారిగా జి.మోహన్‌బాబును నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు మోహన్‌బాబు పల్నాడు జిల్లాలో పనిచేశారు. గుంటూరులో డీఎస్ఓగా పనిచేస్తున్న ఎస్.పద్మశ్రీని పల్నాడు జిల్లాకు బదిలీ చేశారు.

జేసీ శ్రీధర్ బాధ్యతల స్వీకరణ

బాపట్ల: బాపట్ల జిల్లా సంయుక్త కలెక్టర్‌గా చామకూరి శ్రీధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. మేళ తాళాలతో కలెక్టరేట్‌లో అధికారుల నుంచి ఆయనకు ఘనస్వాగతం లభించింది. ముందుగా ఆయన భావన్నారాయణస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. తదుపరి జిల్లా అధికారులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన సీసీఎల్ఏ విజిలెన్స్ విభాగంలో సంయుక్త కార్యదర్శిగా పనిచేస్తూ బదిలీపై బాపట్ల జిల్లా జేసీగా వచ్చారు. జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చామకూరి శ్రీధర్ తెలిపారు.

సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి...

బాపట్ల జిల్లాను అన్ని రంగాలలో ముందుకు తీసుకు వెళ్లడానికి సమన్వయ సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్‌ను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జిల్లాకు కొత్తగా వచ్చిన జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్‌లు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు ఇచ్చి కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా స్థితిగతులు, పురోభివృద్ధిపై కలెక్టర్ చర్చించారు. అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. స్థానిక అక్బర్ పేటలోని ఆర్అండ్‌బీ అతిథి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అతిథి గృహంలో వసతులు, మరుగుదొడ్ల సౌకర్యాలు, నీటి వనరులను ఆయన పరిశీలించారు.



కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలసిన జేసీ శ్రీధర్, ఎస్పీ వకుల్ జిందాల్

సాగర్ కుడికాలువకు నీటి విడుదల

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువ ద్వారా శనివారం రాత్రి 7గంటలకు సాగునీటి అవసరాల నిమిత్తం నీటిని విడుదల చేశారు. సాగర్ ప్రాజెక్టు డీఈ మురళీధర్ మాట్లాడుతూ ప్రాజెక్టు 9వ గేటు ద్వారా 1,000 క్యూసెక్కులు నీటిని విడుదల చేశామని గంటకు 1,000 క్యూసెక్కులు చొప్పున పెంచుతూ రాత్రి 10గంటలకు 4,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఆంధ్రా సీఈ శ్రీనివాస రెడ్డి సాగునీటికి 6 టీఎంసీల నీరు విడుదల చేయాలని కృష్ణానది యాజమాన్య బోర్డును కోరటంతో బోర్డు అంగీకారం తెలిపినట్లు చెప్పారు. ఆదివారం ఉదయానికి 9వేల క్యూసెక్కులు విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సాగర్‌ప్రాజెక్టు ఏఈఈ బాబుమియా, తెలంగాణ డీఈ పరమేష్, ఆపరేటర్ సృజన్ తదితరులు పాల్గొన్నారు.



నాగార్జునసాగర్ కుడికాలువ నుంచి విడుదలవుతున్న నీరు

హామీల అమలుపై ప్రత్యేక దృష్టి

అధికారులతో సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాపట్ల జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలు సత్వరమే అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు.

జిల్లా ప్రజలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఆయన సమావేశం నిర్వహించారు. బాపట్లలో అభివృద్ధి చేయాల్సిన ప్రాధాన్యతా అంశాలను గుర్తించాలని కలెక్టర్ చెప్పారు.

- రాయితీలు వర్తించేలా ఆక్వా చెరువులను ఆక్వా జోన్ పరిధిలోకి తీసుకురావాలని మత్స్యకారులు సీఎంను కోరడంతో జిల్లాలో నూతనంగా 8,200 ఎకరాలను ఆక్వా జోన్ కిందకు తెచ్చామన్నారు. నిజాంపట్నం హార్బర్ నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు లభించగా పనులు కొనసాగుతున్నాయన్నారు. నిజాంపట్నం పోర్టులో బోట్ యార్డ్ నుంచి మత్స్యకార కాలనీ వరకు రివిట్మెంట్ చేయాల్సిన ప్రక్రియ నిర్మాణ దశలో ఉందన్నారు.
- ధాన్యం కొనుగోలులో 20 మెట్రిక్ టన్నులు మించామని కలెక్టర్ చెప్పారు.
- గడపగడపకు మన ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షల నిధులతో మంజూరైన పనులు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. కొమ్మమూరు కెనాల్ అభివృద్ధి కోసం రూ.15 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు.
- కారంచేడులో తాగునీటి చెరువు ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం మంజూరు చేస్తూ అధికారికంగా ఆమోదించిందన్నారు.
- పావులూరులో ఆటోనగర్ ఏర్పాటుపై స్థలం కేటాయించాలన్నారు.
- గుంటూరు కెనాల్ తొండివారు అభివృద్ధికి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.
- రేపల్లెలో 1,344 టిడ్కో గృహాలు త్వరగా పూర్తి చేయాలని ఎస్పీసీఎల్ సంస్థకు 2000లో ఒకసారి నోటీసులు ఇవ్వగా, 2022లో మరోసారి నోటీసులిచ్చామన్నారు. అయినప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంపై ఆరా తీశారు. కేవలం 196 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని వివరించారు.
- వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు, కొల్లూరు మండలాలలోని లంక గ్రామాలలో సాగుచేసుకుంటున్న భూములకు హక్కుపత్రాలు ఇచ్చే ప్రక్రియ పురోగతిలో ఉందని కలెక్టర్ చెప్పారు. నది పోరంబోకు భూములుగా నమోదైన ప్రాంతంలో 1994 మంది రైతులు సాగుచేసుకుంటున్నారని తెలిపారు. భూముల సర్వే ప్రక్రియ పూర్తయిందన్నారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఆ భూములను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.
- వేమూరులో జగనన్నకాలనీలో 161 లేఅవుట్స్ ఉండగా 51 లేఅవుట్స్‌ను మూడడుగులకు పైగా మెరక తోలించాలని ప్రజలు కోరారన్నారు. ఇందుకోసం 158 పనులు మంజూరు కాగా, వేగంగా పనులు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.
- జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్ ఇచ్చే ప్రక్రియ టెండర్ దశలో ఉండగా, పనులు వేగంగా చేపట్టాలన్నారు. మిర్చి పంటకు బీమా పరిహారం అందేలా చూడాలన్నారు. సుబాబుల్ కర్ర కొనుగోలులో ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర పక్కాగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.
- ఎస్సీ, ఎస్టీలు నివాసముండే 62 గ్రామాలకు శ్మశాన భూములు లేవని ముఖ్యమంత్రిని కోరిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇప్పటివరకు 47 గ్రామాలకు భూమిని గుర్తించి కేటాయించే ప్రక్రియ చేపట్టామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు విధిగా శ్మశాన భూమి కేటాయించాలని ఆయన ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ కలెక్టర్ చామకూరి శ్రీధర్, డీఆర్ఓ కె.ఎల్ శ్రీశివజ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

20న విస్తరణ సలహా మండలి సమావేశం

గుంటూరురూరల్: కృష్ణా మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాన్ని ఈనెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి.సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగర శివారుల్లోని లాంఫాంనందున్న సమావేశ మందిరంలో కృష్ణా మండలంలోని వివిధ జిల్లాల రైతుల సమస్యలు, వాటి పరిష్కారాలు, రానున్న సంవత్సరంలో పరిశోధన, విస్తరణ కార్యక్రమాల దిశానిర్దేశంపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, జిల్లా అధికారులు, ఆదర్శరైతులు, రైతు సంఘాల ప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొంటారన్నారు. ఆసక్తి గల రైతులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

క్లుప్తంగా

17న అండర్-23 క్రికెట్ జట్ల ఎంపిక

మేదరమెట్ల: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామంలో గల ఆర్ఎస్సీపీ స్టేడియంలో ఈనెల 17వ తేదీ ఉదయం 9 గంటలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్-2, సీనియర్ క్రికెట్ జట్ల ఎంపిక నిర్వహిస్తామని పీడీసీఏ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి క్రీడాకారుడు తెలుపు జెర్సీలతోపాటు పుట్టిన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు. అండర్-23 క్రీడాకారులు 01-09-2000 తరువాత జన్మించి ఉండాలన్నారు. ఎంపికైన జట్లు ఏప్రిల్ 21వ తేదీ నుంచి కృష్ణాజిల్లా మూలపాడు క్రికెట్ గ్రౌండ్స్‌లో జరిగే ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల పోటీల్లో టీ-20, వన్‌డే మ్యాచ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు పూర్తి వివరాల కోసం పీ.శ్రీనివాస్, సెల్ నెంబర్ 95734 24360, బీ.శ్రీనివాసరావు సెల్: 98495 29919 నెంబర్లలో సంప్రదించాలని అసోసియేషన్ కార్యదర్శి కోరారు.

ఆటోను ఢీకొన్న లారీ

– నలుగురికి గాయాలు



మేదరమెట్ల: ప్రయాణికులతో ముందు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొరిశపాడు మండలంలోని పీ.గుడిపాడు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు ఇంకొల్లు నుంచి ఒంగోలుకు వెళ్తున్న ఆటో పీ.గుడిపాడు జాతీయ రహదారి పక్కన ఉన్న లీలాకృష్ణ హోటల్ వద్దకు రాగానే చిలకలూరిపేట వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న లారీ ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలు కాగా ఎన్‌హెచ్ అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

–జిల్లా వనరుల కేంద్రం బాపట్ల డీటీసీ విజయనిర్మల



మట్టి నమూనాలు సేకరించే విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయాధికారులు

చీరాలరూరల్: భూమి సారవంతాన్ని అనుసరించి ఎరువులు వినియోగిస్తే అధిక దిగుబడులు ఆశించవచ్చని జిల్లా వనరుల కేంద్రం బాపట్ల డీటీసీ విజయనిర్మల అన్నారు. గవినివారిపాలెం-2 రైతు భరోసా కేంద్రంలో చీరాల మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కావూరి రమణారెడ్డి అధ్యక్షతన శనివారం మండల కేంద్రంలోని క్షేత్రస్థాయి వ్యవసాయ సిబ్బందికి 'నేల ఆరోగ్యం-భూసార పరీక్ష ప్రాధాన్యత' అనే అంశాలపై వర్క్‌షాపు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మాగాణి భూముల్లో ప్రతి మూడు పంటల తరువాత, అలానే మెట్ట పొలాల్లో ప్రతి మూడేళ్లకొకసారి భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బాపట్ల ప్రాంతీయ భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయాధికారి బీ.శ్రీనివాసరావు మాట్లాడుతూ భూసార పరీక్ష ప్రాధాన్యత, మట్టి నమూనాలు సేకరించే విధానం, పాటించాల్సిన జాగ్రత్తలు, పరీక్షల నిమిత్తం బ్యాచ్‌లను పంపే సమయంలో రైతుల నుంచి సేకరించి ఫారంలో పొందుపరచాల్సిన అంశాలు గురించి ఆయన వివరించారు. అంతేకాక క్షేత్రస్థాయిలో మట్టి నమూనాలు ఏవిధంగా సేకరించాలో ప్రయోగాత్మకంగా క్షేత్రస్థాయి వ్యవసాయ సిబ్బందికి అవగాగాహన కల్పించారు. కార్యక్రమంలో చీరాల మండల వ్యవసాయ అధికారిణి ఐ.సుమతి, మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల నుంచి గ్రామ వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయ సలహా సంఘం సభ్యులు, డ్రైనేజీ ఏఈ దానియేలు, నీటిపారుదల శాఖ ఏఈ బి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సత్వరమే పూర్తి చేయండి

అధికారులను ఆదేశించిన జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



కలెక్టరేట్ నుంచి సమీక్ష చేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ హాజరైన అధికారులు

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు సత్వరం పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలు నుంచి జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకంతో కలిసి జిల్లాకు చెందిన ముగ్గురు రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ప్రభుత్వానికి చెందిన వ్యవసాయ ఆధారిత భూముల పంపిణీ కోసం గుర్తింపు, లంక భూముల పరిశీలన, ఎస్సీ, ఎస్టీలకు అవసరమైన శ్మశానవాటికల కోసం ప్రభుత్వ భూముల గుర్తింపు, పంపిణీ, ఓ.టి.ఎస్, ఓ.టి.సి, ఎఫ్.పి.ఓ.ఎల్.ఆర్, భూముల రీ సర్వే, ఎఫ్‌లైన్ ఫిర్యాదుల పరిష్కారం, ఇ-ఆఫీస్ పర్యవేక్షణ, స్పందనలో వచ్చే సమస్యల పరిష్కారం, ఏ.పి.మీసేవ సర్వీసుల ద్వారా వచ్చే సమస్యల పరిష్కారం, మ్యుటేషన్ సమస్యల పరిష్కారం, క్రయ, విక్రయాలు, సాదా బైనామా, ప్రభుత్వ అవసరాల కోసం భూసేకరణ, సివిల్ సప్లయ్ పంపిణీలో వచ్చే సమస్యల పరిష్కారం, ఎన్నికలకు సంబంధించి ఓటరు కార్డులకు ఆధార్ కార్డుల అనుసంధానం, నకిలీ ఓటరు కార్డుల తొలిగింపు, మార్పులు, చేర్పులు, ఓటరు కార్డుల బదిలీలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. నిర్దేశిత గడువులోపు ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దారులు పాల్గొన్నారు.

చేనేతలకు మేలు చేసింది జగనన్నే

పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి



విజయలక్ష్మికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: సంక్షోభంలో ఉన్న చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకుచ్చి చేనేతలకు ఎనలేని మేలు చేసింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి అన్నారు. శనివారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి ఆమె చీరాల పర్యటనకు వచ్చారు. పట్టణంలోని మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు నివాసంలో ఆమెను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్చాలు అందించారు. నియోజకవర్గంలో చేనేతలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ఆమెకు వివరించారు. అలానే చేనేతలు నేసే మగ్గాలను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ టీడీపీ హయాంలో చేనేతలకు చంద్రబాబు తీవ్ర అన్యాయం చేస్తే అధికారం చేపట్టినప్పటి నుంచే సీఎం జగన్ సంక్షోభంలో ఉన్న చేనేత రంగానికి జవసత్వాలు తీసుకువచ్చి చేనేతరంగం అభివృద్ధికి కృషి చేశారన్నారు. మగ్గం ఉన్న ప్రతీ చేనేత కార్మికుడికి నేతన్న నేస్తం పథకంలో ఏడాదికి రూ.24 వేలు అందించడంతోపాటుగా చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించారన్నారు. చేనేతలకు వైఎస్సార్ సీపీ అన్నీ విధాల అండగా నిలిచి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. చేనేతలందరు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ మెంబర్ అవ్వారు ముసలయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు జగదీష్, స్వాతి, చేనేత నాయకులు శ్రీకృష్ణ ఉన్నారు.

విజ్ఞాన్‌లో ఏఎఫ్ఎస్‌టీఐ గుంటూరు చాప్టర్ ప్రారంభం

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఏఎఫ్ఎస్‌టీఐ(అసోసియేషన్ ఆఫ్ ఫుడ్ సైంటిస్ట్స్ అండ్ టెక్నాలజిస్ట్స్ ఇండియా) గుంటూరు చాప్టర్‌ను శనివారం అట్టహాసంగా ప్రారంభించారు. విజ్ఞాన్ యూనివర్సిటీలో గ్రీన్ కోటింగ్ 'ఇన్వెస్టింగ్ ఇన్ ద ఫ్యూచర్ ఆఫ్ ఫుడ్ సిస్టమ్' అనే అంశంపై శనివారం వర్క్‌షాప్ జరిగింది. ఏఎఫ్ఎస్‌టీఐ వైస్ ప్రెసిడెంట్, హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్- సీఎఫ్‌టీఆర్ఐ ఆర్‌సీ సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ టీ జ్యోతిర్మయి మాట్లాడుతూ ఏఎఫ్ఎస్‌టీఐ అనేది ప్రపంచంలోనే అతి పెద్ద ప్రొఫెషనల్, ఎడ్యుకేషనల్ ఆర్గనైజేషన్ అని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే 46 చాప్టర్లు, 4500 మంది సభ్యులు ఉన్నారని, అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో నేడు రెండో ఏఎఫ్ఎస్‌టీఐ చాప్టర్‌ను ప్రారంభించామన్నారు. మానవాళికి నాణ్యమైన ఆహారాన్ని అందించటమే ఏఎఫ్ఎస్‌టీఐ ముఖ్య ఉద్దేశమన్నారు. ఏఎఫ్ఎస్‌టీఐ మాజీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పీ రామకృష్ణ, మహారాష్ట్రలోని విట్టల్‌గంగా ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కో.లిమిటెడ్ ఫౌండర్ ధనరాజ్ షిండే పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

20 కిలోలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బండారు సురేష్‌బాబు, పక్కన ఎస్ఐలు గీతాంజలి, కోటేశ్వరరావు

పెదకాకాని: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, 20 కిలోలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ విశాఖపట్నం గాజువాక నుంచి అనంతపురం పుట్టపర్తికి ఆర్టీసీ బస్సులో గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ముందస్తు సమాచారం మేరకు విజయవాడ బస్టాండ్ నుంచి పుట్టపర్తి బయలు దేరిన బస్సును పెదకాకాని వై జంక్షన్‌లో తనిఖీ చేసినట్లు చెప్పారు. తనిఖీలో రెండు కిలోల బరువు కలిగిన 10 ప్యాకెట్లు గంజాయి లభ్యమైందని వివరించారు. గంజాయి తరలిస్తున్న పాపాని రవిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడు తెలంగాణ నల్గొండ జిల్లా, నకిరేకల్లు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రవి గత కొంతకాలంగా చెడు అలవాట్లకు బానిసై అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలనే దురాశకు పోయినట్లు చెప్పారు. గాజువాకకు చెందిన కోటి అనే వ్యక్తితో 20 కిలోల గంజాయిని పుట్టపర్తి తీసుకు వెళితే 15 వేల రూపాయలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించారు. ఈ కేసులో గంజాయి తరలిస్తున్న పాపాని రవితో పాటు గంజాయి సరఫరా చేస్తున్న కోటి అనే వ్యక్తిపైన కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి తరలిస్తున్న పాపాని రవిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ బండారు సురేష్ బాబు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐలు పాదర్తి కోటేశ్వరరావు, గీతాంజలి పాల్గొన్నారు.